నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | నల్లగొండ, శనివారం 21 జూన్ 2025 | YADADRI BHUVANAGIRI

## భూగర్భ శాస్త్రం చదివితే ఉజ్వల భవిష్యత్



ఎంజీయూలో జియాలజీ కోర్సుపై కరపత్రం ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

రామగిరి, జూన్ 20: యూజీ, పీజీలో భూగర్భశాస్త్రం చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ జియాలజీ ఆధ్వర్యంలో ఆ కోర్సులోని అడ్మిషన్స్, ఉద్యోగ అవకాశాలు, కేరియర్ గైడెన్స్ అంశాలపై తయారు చేసి బ్రోచర్స్, కరపత్రాలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవితో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, డిపార్టుమెంట్ ఆఫ్ జియాలజీ హెచ్‌వోడీ ఆంజనేయులు, అధ్యాపకులు మశ్చేంద్ర, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత

**ఎస్పీ నరసింహ**



సూర్యాపేట టౌన్, జూన్ 20 : ఈ నెల 26న డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగంతో కలిసి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని డ్రగ్స్ నిర్మూలన మనందరి సామాజిక బాధ్యతని, గంజాయి వంటి వాటి నుంచి మన భావితరాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు తెలంగాణ రాష్ట్ర పోలీసు యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పౌరులు, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల వారు ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని భావి తరాలను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడుకోవాలన్నారు.



సూర్యాపేట ప్రభుత్వ దవాఖానలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి

**అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి**

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

సూర్యాపేట టౌన్, జూన్ 20: సాధారణ ప్రసవాలకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. సదరం క్యాంపు నిర్వహించేటప్పుడు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ వచ్చే రోగుల వివరాలు, జ్వరంతో దవాఖానకు వచ్చే వారికి వైద్య సేవలు అందించడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. దవాఖానకు వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ సెంటర్ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డీ అడిక్షన్ సెంటర్ కోసం స్థలం సేకరించాలని సూచించారు. అత్యవసర వార్డు, టీబీ యూనిట్ వార్డు, జెరియాట్రిక్ కేర్ వార్డు, డేకేర్, కీమోథెరపీ వార్డు, జ్వరం, కొవిడ్ ఐసోలేషన్ వార్డులను పరిశీలించి వైద్య సేవలు, మందులు ఇస్తున్నారా లేదా అని పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా బ్లడ్ టెస్టుల వివరాలు, రిజిస్టర్‌లో నమోదును పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందుల లభ్యత గురించి ఆరా తీశారు. అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దవాఖానలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేస్తూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్ఎంవో వినయ్ఆనంద్, డాక్టర్ లక్ష్మణ్, అధికారులు ఉన్నారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## టీచర్ అవతారమెత్తిన కలెక్టర్

రామగిరి, జూన్ 20: నల్లగొండ ఆర్పీ రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కళాశాల నోటీసు బోర్డులో పొందుపర్చిన వివరాలు, కోర్సులు, విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మమేకమై సబ్జెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటూ చక్కటి మోటివేషన్ పాఠ్యాంశాలను బోధించి ఆకట్టుకున్నారు. అలాగే కళాశాల ఆవరణను పరిశీలించి వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 2024-25లో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులు సూఫియా (సీఈసీ 485), శిరిష (హెచ్‌ఈసీ 475), రిషి (ఎంపీసీ 458), స్వాతిక, తహూరా ఫిరదౌసి (బీపీసీ 410)కి బహుమతులు అందచేసి అభినందించారు.

# అడ్డికి పావుశేరే..!

## సన్నాలు పండించిన రైతుకు మిగిలిన బోనస్ అంతంతే

### కొనుగోలు కేంద్రాలకు వచ్చింది అత్యల్పం

- 17.57లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి 76వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు
- మిల్లర్లకు అమ్ముకున్నదే 15లక్షల మెట్రిక్ టన్నులకు పైనే..
- రైతులు కోల్పోయిన బోనస్ విలువ రూ.750 కోట్లు
- రైతులకు చెందే బోనస్ కేవలం 38కోట్లే
- అది కూడా నేటికి రాని వైనం
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

*రాష్ట్రంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్న జిల్లాల్లో అగ్రస్థానంలో నిలుస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగిలో సన్నాలు పండించిన రైతులకు బోనస్ ప్రయోజనం అతిస్వల్పంగానే దక్కింది. యాసంగి సీజన్‌లో సన్నాల దిగుబడి అంచనాలు భారీగా ఉండగా అందులోనూ సగానికి పైగానే కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఆచరణలో ప్రభుత్వ కేంద్రాలపై నమ్మకం లేక, కొనుగోలు విధానంలోని కొర్రీల వల్ల సన్నధాన్యం ఇక్కడ అమ్మేందుకు రైతులు విముఖత చూపారు. దీంతో రైతులంతా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే నాటికే మెజార్టీ ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకే అమ్ముకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు సుమారు రూ.750కోట్ల బోనస్‌ను కోల్పోయారు. దీనికి తోడు మిల్లు పాయింట్ల వద్ద విక్రయించేందుకు రైతుల ఆతృతను ఆసరాగా చేసుకొని మిల్లర్లు, వ్యాపారులు సైతం సిండికేట్‌గా మారి ధర తగ్గించారు. దీనివల్ల కూడా క్వింటాలుకు మద్దతు ధరతో పోలిస్తే మరో రూ.200 నుంచి 300 ధరను రైతులు కోల్పోయారు. మద్దతు ధర లభించకపోగా ప్రభుత్వం ఇస్తామన్న క్వింటాలుకు రూ.500 బోనస్‌ను కూడా రైతులు కోల్పోయారు. ఇవన్నీ కలిపి అటుఇటూ రైతులు సుమారు రూ.వెయ్యి కోట్లు నష్టపోయారని అంచనా.*



ధాన్యం ఆరబోసిన రైతులు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 20(నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 1063 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. వీటిల్లో కొన్నిచోట్ల ప్రత్యేకంగా సన్నధాన్యం కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో నెల రోజుల పాటు ఒక్క గింజ కూడా ఈ కేంద్రాలకు రాలేదు. చివర్లో మాత్రం కొందరు రైతులతో పాటు దళారులు సైతం బోనస్ కోసం అరకొరగా సన్నాలను కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించారు. యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 29.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేయగా, ఇందులో సుమారు 17.57 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సన్నాల్లో కనీసం సగానికి పైగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అధికారులు భావించారు. కానీ ఆచరణలో సన్నాల రాకపై బొక్కాబోర్లా పడ్డారు. చివరికి పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా కలిపి మొత్తం 76వేల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మాత్రమే కేంద్రాలకు వచ్చింది. దీనికి మాత్రం ప్రభుత్వం అందించనున్న రూ.38కోట్ల బోనస్ రానుంది. మిగతా ధాన్యం అంతటికీ రైతుల బోనస్ కోల్పోయినట్లే. ఎన్నికలకు ముందు ధాన్యానికి క్వింటా ఒక్కంటికి మద్దతు ధరపై రూ.500 బోనస్ అదనంగా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అధికారంలోకి రాగానే సన్నవడ్లకే బోనస్ అని ప్రకటించిన విషయం తెలిసిందే. అది కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సన్నవడ్లను తెచ్చిన రైతులకే రూ.500 బోనస్ అని తిరకాసు పెట్టారు. ఇది ఎలాగూ నల్లగొండ జిల్లాలో ఆచరణసాధ్యం కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

### సింహభాగం మిల్లర్లే..

మిర్యాలగూడ చుట్టుపక్కల ప్రాంతాల్లోని మిల్లర్లే సన్నాల్లో సింహభాగం నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో 17.57లక్షల మెట్రిక్ టన్నుల సన్నాల దిగుబడి అంచనా వేయగా సుమారుగా 15లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు మిల్లర్లు కొనుగోలు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. మిల్లు పాయింట్ల వద్ద ఒకేసారి ధాన్యం పోటెత్తినప్పుడు ఇదేఅదునుగా మిల్లర్లు, వ్యాపారులు ధాన్యం ధర తగ్గించి రైతులను నిలువుదోపిడీ చేశారు. పక్క రాష్ట్రాల నుంచి కూడా సన్నాలను తక్కువ ధరకు దిగుమతి చేసుకొని ఇక్కడి రైతులకు మద్దతు ధర కూడా చెల్లించలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయాలు జరగ్గా రైతులు సుమారు రూ.750 కోట్ల బోనస్‌ను కోల్పోయినట్లు సమాచారం. రైతులు నేరుగా సన్నాలను మిల్లర్లకు విక్రయించడం ద్వారా పౌర సరఫరాల శాఖకు కూడా సన్నబియ్యం లభించడం అంత సులభం కాదు.

### ప్రభుత్వ తీరుతో మిల్లర్ల వద్దకు...

వాస్తవంగా కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయాలకు నానారకాల షరతులు అడ్డంకిగా మారాయి. సాధారణంగా సన్నవడ్లను రైతులు నేరుగా పొలాల్లో వరి కోత యంత్రాలతో కోసి ట్రాక్టర్లలో నింపుకొని దగ్గరలోని రైసు మిల్లులకే తరలిస్తుంటారు. అక్కడ తేమ శాతంతో సంబంధం లేకుండా మిల్లర్లు ప్రభుత్వ మద్దతు ధరకు అటూఇటూగా కొనుగోళ్లు చేస్తుంటారు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి కొన్నిసార్లు మద్దతు ధరకు మించి కూడా సన్నాలకు ధర లభిస్తుంటుంది. మరికొన్ని సార్లు ధాన్యం రాకను బట్టి ధర తగ్గుతూ కూడా ఉంటుంది. రైసు మిల్లులకు తీసుకెళ్లే సన్నవడ్లల్లో తేమశాతం కనీసం 23 నుంచి 28 వరకు ఉండడం సహజం. ఇంత తేమ శాతం ఉన్నా సరే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకున్న మిల్లర్లు దీని నుంచే నాణ్యమైన బియ్యాన్ని ఎగుమతి చేస్తుంటారు. దీనివల్ల అమ్ముకునే రైతులకు ఇబ్బంది లేదు... కొనుగోలు చేసే మిల్లర్లకు సన్నాల్లోని తేమశాతంతో నష్టం లేదు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా నేరుగా రైతులు సన్నాలను రైసుమిల్లులకే తరలించి అమ్ముకున్నారు. క్వింటాల్‌కు రూ.2100 నుంచి రూ.2400 వరకు ధర లభించింది. బోనస్ గురించి ఆలోచిస్తే అసలుకే ఎసరు వస్తుందని రైతులు ప్రైవేటుగా అమ్ముకునేందుకు మొగ్గు చూపారు.



మిల్లుల వద్ద క్యూ కట్టిన ధాన్యం లారీలు

### బోనస్ కోసం ఆశపడితే...

**సన్నాలను విక్రయించాలంటే 17శాతం తేమ ఉండాలన్నది ప్రాథమిక నిబంధన. కానీ సన్నాలకు అదీ సాధ్యం కాదనేది రైతుల అభిప్రాయం. సన్నాలను ఆరబెట్టినా క్వింటాల్ ఒక్కంటికీ కనీసం 8 నుంచి 10 కిలోల వరకు తూకం తగ్గిపోతుంది. రూ.500 బోనస్ కోసం ఆశపడితే రోజుల తరబడి గోస పడాల్సిందేనన్న భయంతో రైతులు సన్నాల కొనుగోలు కేంద్రాల వైపు చూడడం లేదు. దీనికంటే కోసిన పంటను పొలాల నుంచి నేరుగా మిల్లులకు తరలిస్తే తూకంలోనూ బోనస్ మందం కలిసి వస్తుందని రైతులు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వ బోనస్ వైపు సన్నాల రైతులు ఆలోచించడమే మానేశారు. నిజంగా ప్రభుత్వ మద్దతు ధరకు బోనస్‌తో కలిపి రైతులకు ఒక్కో క్వింటాల్ సన్నాలకు రూ.2820 ధర దక్కాలి. కానీ ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ ధర దక్కింది కేవలం 76వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికే కావడం గమనార్హం. యాదాద్రి జిల్లాలో 970 మెట్రిక్ టన్నులు కాగా, నల్లగొండ జిల్లాలో 23,700 మెట్రిక్ టన్నులు, సూర్యాపేటలో 51వేల మెట్రిక్ టన్నుల సన్నాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది.**

## రైతుల ఖాతాలో రూ. 271.20 కోట్లు జమ

సూర్యాపేట టౌన్, జూన్ 20: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలోని 2,61,912 మంది రైతుల ఖాతాల్లో రూ 271.20కోట్ల నిధులు జమ చేసిందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వానకాలం సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం జిల్లాలో 2,89,371 మంది రైతులకు నిధులను నేరుగా వారి ఖాతాలో జమ చేస్తోందన్నారు. ఈనెల 16నుంచి నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం జిల్లాలో 2,61,912 మంది రైతుల ఖాతాల్లో రూ 271.20కోట్ల నిధులు జమ అయ్యాయన్నారు. కొత్త పాస్ బుక్కులు వచ్చిన వారు వ్యవసాయ విస్తరణాధికారులను కలిసి సరైన పత్రాలు సమర్పించాలన్నారు. వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతా నెంబర్లను అందించాలని కలెక్టర్ సూచించారు.

# కొందరికే 'భరోసా'..!

**అదికూడా కొంతమేరకే..**

**రైతు భరోసా కింద తమకు నగదు జమ కాలేదంటూ రైతుల ఆందోళన**



యాదగిరిగుట్ట వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

యాదగిరిగుట్ట, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న రైతుభరోసా రైతులకు నిరాశే మిగులుస్తోంది. వారికి ఉన్న భూమిలో కొంత మేరకే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇందుకు మండల వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనే నిదర్శనం. శుక్రవారం పట్టణంలోని ఏవో కార్యాలయానికి పలు గ్రామాలకు చెందిన రైతులు వచ్చి తమకు అరకొరగా రైతుభరోసా నగదు జమ అయిందని, ఎంతవరకు పడిందో అర్థం కావడంలేదని వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. ఇంతకి రైతు భరోసా వస్తుందా రాదా అంటూ అధికారులను నిలదీయడంతో వారు ఇబ్బందులు పడ్డారు. మరికొద్దిరోజుల్లో అందరికీ రైతు భరోసా అందుతుందని సమాధానం చెప్పడమే తప్ప వారి వద్ద సరైన సమాధానం లేకుండా పోయింది. ఇప్పటివరకు తనకు ఉన్న వ్యవసాయ భూమికి రైతుభరోసా రావడం లేదని గౌరాయిపల్లికి చెందిన రైతు వనగంటి సత్తయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రూ.2000 ఖాతాలో జమ అయ్యాయని, అవి ఎక్కడివో అర్థం కావడంలేదని అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. రామాజీపేటకు చెందిన రైతు తునికి ఆంజనేయులు తనకు ఉన్న 5 ఎకరాల భూమికి గతంలో రైతుబంధు నగదు ఖాతాల్లో జమఅయ్యేదని, కానీ గత రెండు దఫాలుగా రైతుభరోసాతో పాటు రుణమాఫీ సైతం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సొంత మండలంలోనే రైతులకు రైతు భరోసా మంజూరు కాలేదంటే జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రతి రైతుకు రైతు భరోసాను అమలు వారు ప్రభుత్వాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

### మిగతా భూమికి ఇస్తరో లేదో..



నాపేరు రామిరెడ్డి, మాది మండలంలోని గౌరాయిపల్లి గ్రామం. నాకు 2.09 ఎకరాల పట్టా భూమి ఉంది. ఇందులో వ్యవసాయం చేసుకుంటూ వివిధ పంటలను పండిస్తున్నా. గత ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో రైతుబంధు నగదు ఖాతాలో జమ అయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత రెండేళ్లుగా రైతుభరోసా రాకపోగా ఈసారి కేవలం 25 గుంటలకు మాత్రమే రైతు భరోసా అందింది. మిగతా భూమికి ఇస్తరో లేదో తెలియదు.

**– రామిరెడ్డి, రైతు, గౌరాయిపల్లి గ్రామం, యాదగిరిగుట్ట మండలం**

# ఆనంద యోగం

## యోగాతో శారీరక, మానసిక సమస్యలు దూరం

- ప్రతి ఆసనానికి ప్రత్యేక స్థానం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం





రామగిరి, జూన్ 20: మనసును నియంత్రణలో ఉంచి, శరీర ధృడత్వం, మానసిక ప్రశాంతతను చేకూర్చేది యోగాభ్యాసం అందం..ఆనందం...ఆరోగ్యం ..అన్నింటికీ మూలం యోగానే. ఉరుకుల పరుగుల జీవితంలో రకరకాల ఒత్తిళ్లు, ఉద్యోగం, చదువులతో యువత తీవ్ర మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. వీటన్నింటి నుంచి ఉపశమనం పొందే ఏకైక మార్గం, అద్భుతమైన జీవన ప్రక్రియ యోగా. వేల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన యోగా విద్య నేడు అంతర్జాతీయ వేడుకైంది. ప్రపంచనికి యోగాను అందించింది మన దేశమే కావడం గమనార్హం. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల్లో, పలు సంస్థల ఆధ్వర్యంలో యోగా దినంగా పాటించనున్నారు. ప్రాచీన కాలంలో యోగులు, ఋషులు దీర్ఘకాలం జీవిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవలంబించిన పద్ధతే నేటి యోగా. యోగా క్రీ.పూ 6000 ఏండ్లకు పూర్వమే ఉన్నట్లు చరిత్ర సాక్ష్యాలు చెబుతున్నాయి. ఉపనిషత్తుల్లోనూ యోగా విద్య గురించి ప్రస్తావన ఉంది. యోగాకు ఆద్యుడు ఎవరనే విషయం ఇంతవరకు కచ్చితంగా తెలియదు కాని, ప్రపంచానికి యోగా విద్యను పరిచయం చేసింది మాత్రం 'పతంజలి మహర్షి' ఆయననే యోగా విద్యకు ఆద్యునిగా పిలుస్తారు. 2015లో ప్రపంచంలోని 174 దేశాలు యోగా దినోత్సవాన్ని పాటించగా 2025లో 256 దేశాలు భాగస్వామ్యమైనవి. వీటిలో 55 ముస్లిం దేశాలు కూడా ఉండటం గమనార్హం.

### శిశు మరణాలపై

## అవగాహన కల్పించాలి

నల్లగొండ, జూన్ 20: సరైన పోషకాహారం తీసుకోకపోవటంతోపాటు ప్రసవానికి, ప్రసవానికి మధ్య దూరం లేకపోవటం వల్ల శిశు మరణాలు సంభవిస్తున్నాయని, ఈ విషయంలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు సరైన అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేవరకొండ డివిజన్ పరిధికి సంబంధించిన అధికారులతో ఆమె మాట్లాడారు. వెంటవెంటనే కాన్పు కావడం వల్ల పుట్టబోయే బిడ్డ సరైన విధంగా పుట్టకపోవటం, బరువు తక్కువగా పుట్టడం, లేదా అనారోగ్యంతో పుట్టడం, తద్వారా మరణాలకు దారితీస్తుందన్నారు. ఇలాంటివి జరగకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహార లోపం లేకుండా చూడటంతోపాటు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. దేవరకొండ ప్రాంతాల్లో పౌష్టికాహారం ఎలా తీసుకోవాలో పోషణ అభియాన్ సందర్భంగా వివరించామని, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. డివిజన్ వ్యాప్తంగా సబ్ సెంటర్ వైజ్‌గా సమీక్ష నిర్వహిస్తానని, ఎక్కడైన శిశు మరణాలు సంభవిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్,, డీసీహెచ్‌వో మాతృనాయక్, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపేటలో ఎన్ఎస్పీ భూముల సర్వే

- అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులు
- అడ్డుకున్న పోలీసులు



అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

హాలియా, జూన్ 20: కలెక్టర్ ఆదేశాల మేరకు అనుముల మండలం ఇబ్రహీంపేటలో శుక్రవారం ఎన్ఎస్పీ భూములను సర్వే చేశారు. భూములను ఆక్రమించారంటూ అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టును ఆశ్రయించాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డివిజన్ సర్వేయర్లు సర్వేనంబర్ 16, 17, 68, 72,482,484,485,486, 490, 491లో ఉన్న 105 ఎకరాల భూమిని ఇన్‌ఛార్జి తహసీల్దార్ రఘు ఆధ్వర్యంలో సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. భూములను రెవెన్యూ అధికారుల సర్వే చేయడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి సర్వేచేయించారు. 50 ఏండ్లుగా సేద్యం చేస్తున్నామని తమ భూములను సర్వే చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

## దిర్శించర్లలో వరి విత్తనాలు సీజ్

నేరేడుచర్ల, జూన్ 20: నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో అనుమతుల్లేని 273 క్వింటాళ్ల వరి విత్తనాలను శుక్రవారం రాత్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి పట్టుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చలమందరాజు, ఏవో జావిద్, ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దిర్శించర్లలో షేక్ జలీల్ అనే వ్యక్తి అనుమతుల్లేని వరి విత్తనాలు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఆయనకు చెందిన రెండు రేకుల షెడ్లపై దాడి చేయగా 570 బస్తాల వరి విత్తనాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటి విలువ రూ.13,65,000 ఉంటుందన్నారు. విత్తనాలను సీజ్ చేసి జలీల్‌పై కేసు నమోదు చేశామని, నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.



నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో అనుమతుల్లేని వరి విత్తనాలను సీజ్ చేస్తున్న సీఐ చలమందరాజు, ఏవో జావిద్, ఎస్ఐ రవీందర్